

డీఈఈ వెంకన్నతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

రోడ్లపై మురుగు పారుతుంటే ఏం చేస్తున్నారు..?

● మీర్‌పేట్ అధికారులపై ఎమ్మెల్యే సబిత ఆగ్రహం

సరూర్‌నగర్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ప్రధాన రహదారులపై మురుగు నీరు ప్రవహిస్తుంటే ఏం చేస్తున్నారు.. డ్రైనేజీ వ్యవస్థను బాగుచేయాలనే ఆలోచన కూడా లేదా? అని మహేశ్వరం ఎమ్మెల్యే పీ.సబితారెడ్డి మీర్‌పేట్ కార్పొరేషన్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఆమె జిల్లెలగూడలోని క్యాంపు కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండి వారి నుంచి పలు వినతులు స్వీకరించారు. అనంతరం తిరిగి వెళ్లే క్రమంలో ఆర్‌సీఐ రహదారిలోని సర్వీసు రోడ్డుపై పారుతున్న మురుగు నీటిని చూసి తన వాహనాన్ని ఆపి పరిశీలించారు. ప్రధాన రహదారిలో ఈ మురుగు ప్రవాహమేంటని ఆరా తీశారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడమే సమస్యకు కారణమని గ్రహించిన ఆమె.. వెంటనే మునిసిపల్ డీఈఈ వెంకన్నకు ఫోన్‌చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వీసు రోడ్డులోని మురుగు నీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, కార్పొరేటర్ రేఖాలక్ష్మణ్‌ముదిరాజ్, పార్టీ మీర్‌పేట్ శాఖ అధ్యక్షుడు కామేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మీర్‌పేట్ శాఖ ఉపాధ్యక్షుడిగా రాజు

సరూర్‌నగర్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ మీర్‌పేట్ శాఖ ఉపాధ్యక్షుడిగా సింగం రాజు పటేల్‌ను పార్టీ అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి నియమించగా ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సబితారెడ్డి ఆయనకు నియామక పత్రం అందజేశారు.



ఐఎస్‌సదన్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

పాతబస్తీ విద్యుత్ నిర్వహణను ప్రైవేట్ కంపెనీకి ఇవ్వొద్దు

సైదాబాద్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తెచ్చిన విద్యుత్ ప్రైవేటీకరణ సంస్కరణ అమలులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పాతబస్తీలో విద్యుత్ నిర్వహణను ఆదానీ కంపెనీకి ఇవ్వాలన్న నిర్ణయాన్ని తక్షణమే రద్దు చేయాలని కోరుతూ సీపీఎం నాయకులు ఆదివారం ఐఎస్‌సదన్ చౌరస్తాలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్రంలో ఉన్న తొమ్మిది విద్యుత్ సర్కిళ్లలో మొదటి దశగా సౌత్ సర్కిల్(పాతబస్తీ)ను ఆదానీ కంపెనీకి అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారని సీపీఎం రాష్ట్ర నాయకుడు ఈశ్వర్‌రావు ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వర్, కోటయ్య, మీన, బాలునాయక్, శ్రావణ్, జంగయ్య, కిషన్, బాబర్‌ఖాన్ పాల్గొన్నారు.



బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం ప్రతినిధులు

బడంగ్‌పేట్ బ్రాహ్మణ సేవా సంఘం కార్యవర్గం ఎన్నిక

సరూర్‌నగర్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ నగర బ్రాహ్మణ సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఇక్కడి వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మూడోసారి మంగు రాఘవరావు ఎన్నికయ్యారు. మిగతా కార్యవర్గంలో ప్రధాన కార్యదర్శిగా బోర్పట్ల విరాట్ స్వరూపాచార్య, ఉపాధ్యక్షులుగా బళ్లమూడి రాంబాబు, మంత్రాల శ్రీరామమూర్తి, వేముల కవిత, సహాయ కార్యదర్శులుగా వింజమూరి మధుసూదన్‌రావు, నందూరి ప్రకాశ్, ఇంగువ కిరణ్, కార్యనిర్వహక కార్యదర్శిగా నూకల సతీశ్‌కుమార్, ప్రచార కార్యదర్శిగా వేముల రవికుమార్, సాంస్కృతిక కార్యదర్శిగా పొట్లూరి విజయలక్ష్మి, సభ్యులుగా శ్రీనివాస్‌రావు, ఉమా శంకర్‌రావు, మాధవరావు, నరేందర్, మాధురి, మైథిలి, శారద, బద్రీనాథ్, కార్తీక్, జగన్నాథ్ తదితరులు ఎన్నికయినట్టు ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన ఏవీ రావు, రత్నాకర్‌రావు తెలిపారు.

నాగోల్ ఎస్‌హెచ్‌ఓగా సుధీర్‌కృష్ణ బాధ్యతల స్వీకరణ



కొత్తపేట, జూన్ 30(ఆంధ్రజ్యోతి): నాగోల్ పీఎస్ నూతన ఎస్‌హెచ్‌ఓగా సుధీర్‌కృష్ణ బాధ్యతలు స్వీకరించారు. 2009 బ్యాచ్‌కు చెందిన సుధీర్‌కృష్ణ రాచకొండ కమిషనరేట్ పరిధిలోని బాలాపూర్, కీసర పీఎస్‌లలో డీఐగా, మల్కాజిగిరి ట్రాఫిక్ పీఎస్, భువనగిరి టౌన్ పీఎస్‌లో లా అండ్ ఆర్డర్ ఎస్‌హెచ్‌ఓగా విధులు నిర్వహించారు. పహడీషరీఫ్ డీఐగా విధులు నిర్వహిస్తున్న ఆయన నాగోల్ పీఎస్ ఎస్‌హెచ్‌ఓగా బదిలీపై వచ్చారు.

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి

● బైక్ వెనక కూర్చున్న వ్యక్తికి స్వల్పగాయాలు

చాదర్‌ఘాట్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): వేగంగా వెళ్తున్న లారీ ముందున్న బైక్‌ను ఢీ కొట్టడంతో దానిపై ప్రయాణిస్తున్న ఇద్దరిలో బైక్ నడుపుతున్న బీటెక్ విద్యార్థి తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ వెనక కూర్చున్న వ్యక్తి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. చాదర్‌ఘాట్ ఎస్ఐ రవిరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. జోగులాంబ గద్వాల్ జిల్లా, వడ్డెపల్లి మండలం, శాంతినగర్ గ్రామానికి చెందిన సోమన్న అలియాస్ శ్యామ్(23) ఇబ్రహీంపట్నంలోని ఏవీఎన్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. తన స్నేహితులతో కలిసి చైతన్యపురిలోని గదిలో ఉంటున్నాడు. పార్ట్ టైమ్‌గా ఉబర్ బైక్ రైడర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం కస్టమర్ వెంకటరమణ ఉబర్ బుక్ చేయగా అందుకు సోమన్న తన బైక్‌పై చైతన్యపురి నుంచి కాచిగూడ రైల్వేస్టేషన్‌కు తీసుకెళ్తున్నాడు. మలక్‌పేట అక్షయ్ హోటల్ సమీపంలోని న్యూ మార్కెట్ మెట్రో స్టేషన్ పిల్లర్‌నంబర్ 1443 వద్ద వెనక నుంచి వేగంగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో అదుపు తప్పింది. ఈ సంఘటనలో బైక్ నడుపుతున్న ఉబర్ రైడర్ సోమన్న రోడ్డుకు కుడివైపు కింద పడిపోగానే వెనక ఉన్న లారీ చక్రాల కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్ వెనక కూర్చున్న కస్టమర్ వెంకటరమణ ఎడమ వైపు కిందపడడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. విషయం తెలియగానే చాదర్‌ఘాట్ పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని సోమన్న మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటన అనంతరం లారీ డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోయాడని పోలీసులు తెలిపారు. కేసును చాదర్‌ఘాట్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొట్టడంతో మరొకరు..

కూకట్‌పల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కారు అతివేగంగా వచ్చి స్కూటీని వెనుక నుంచి ఢీకొట్టిన ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లికి చెందిన నాగప్ప(70), లక్ష్మి(51)లు బంధువులు. వీరిద్దరు ఆదివారం కూకట్‌పల్లి ఐడీఎల్ రోడ్డులోని రంగనాయకస్వామి ఆలయంలో నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు స్కూటీపై వెళ్తున్నారు. జాతీయ రహదారిపై ఐడీఎల్ ఎదురుగా వెళ్తున్న వీరి స్కూటీని అతి వేగంగా వచ్చిన కారు (టీఎస్ 07 ఇఆర్ 2727) ఢీకొట్టింది. దీంతో ఇద్దరూ రోడ్డుపై పడిపోవడంతో తీవ్రగాయాలయ్యాయి. ఇద్దరిని స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే నాగప్ప మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. లక్ష్మి గాయాలతో చికిత్స పొందుతోంది. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

● నిరాశతో వెనుదిరుగుతున్న వాకర్స్
● సాయిబాలాజీ కాలనీ వద్ద ఇదీ పరిస్థితి

పబ్లిక్ పార్కుకు.. ప్రైవేటు 'తాళం'..!

మీర్‌పేట్ మునిసిపల్ పార్క్‌పై కాలనీవాసుల పెత్తనం

సరూర్‌నగర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): అది పక్కా పబ్లిక్ పార్కు.. కానీ దానిపై ఓ కాలనీవాసులు పెత్తనం చెలాయిస్తున్నారు. మునిసిపల్ కార్పొరేషన్ వారు ప్రజల సౌకర్యార్థం గేటు ఏర్పాటు చేస్తే.. ఆ గేటు పక్కన గల కాలనీవాసులు దానికి తాళం కప్ప బిగిస్తున్నారు. దాంతో నిత్యం అక్కడకు వాకింగ్ కోసం వచ్చే వాకర్స్‌కు నిరాశ తప్పడంలేదు. మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని పెద్దచెరువు వద్ద సుందరీకరణలో భాగంగా ఏర్పాటు చేసిన మునిసిపల్ పార్కు వద్ద ఈ పరిస్థితి నెలకొంది.



మీర్‌పేట్ పెద్దచెరువు వద్ద గల పబ్లిక్ పార్కుకు వేసిన తాళం

పార్కు మీర్‌పేట్‌ది..

తాళం వేసేది బడంగ్‌పేట్ కాలనీవాసులు

పెద్దచెరువు ఎగువన గల ఖాళీ స్థలంలో మీర్‌పేట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మునిసిపల్ పార్కును ఆనుకుని బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడ పరిధిలోకి వచ్చే శ్రీసాయిబాలాజీ టౌన్‌షిప్ కాలనీ ఉంది. అల్మాస్‌గూడ పరిసర ప్రాంతాల ప్రజలను దృష్టిలో పెట్టుకుని ఈ కాలనీలోని ఓ అంతర్గత రోడ్డులో ప్రవేశద్వారం(గేటు) ఏర్పాటు చేశారు. ప్రతి రోజూ ఉదయం అనేక మంది స్థానికులు ఈ పార్కులోకి వాకింగ్ కోసం వస్తుంటారు. అయితే గత పది రోజులుగా కాలనీ సంక్షేమ సంఘంలోని కీలక ప్రతినిధి ఒకరు సదరు ప్రవేశద్వారానికి(గేటుకు) తాళం వేయిస్తున్నారు. దీంతో పార్కు గేటుకు 24 గంటలు తాళం వేసే ఉంటుంది. తనకు రాజకీయ నాయకుల అండ ఉన్నదనే ధీమాతో ఆయన ఇష్టానుసారంగా సొంత నిర్ణయాలు తీసుకుని పార్కు గేటుకు తాళం వేయిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దాంతో వాకర్స్ నిరాశగా వెనుదిరుగుతున్నారు. మీర్‌పేట్ మునిసిపల్ పార్క్‌కు కాలనీవాసులు తాళం వేయడం ఎంత వరకు సమంజసమని వాకర్స్ ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి గేటు తెరిచే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఫ్లైఓవర్ పనులు చేపట్టాలి

● బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్లు

వనస్థలిపురం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): విజయవాడ జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా వనస్థలిపురం పనామా చౌరస్తాలో చేపట్టే అండర్‌పాస్ పనులు చేపట్టకుండా ఫ్లైఓవర్ పనులు మాత్రమే చేపట్టాలని బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. ఆదివారం వనస్థలిపురం మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి మాజీ కార్పొరేటర్లు కొప్పుల విఠల్‌రెడ్డి, సామ తిరుమల్‌రెడ్డి, జిన్నారం విఠల్‌రెడ్డి, సాగర్‌రెడ్డిలు హాజరై మాట్లాడారు. హైదరాబాద్ ప్రతిష్ఠతకు ఎలాంటి బంగం కలగకుండా గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో నగరంలో చేపట్టిన విధంగా ఫ్లైఓవర్ పనులను చేపట్టాలని డిమాండ్ చేశారు. వనస్థలిపురం పనామా చౌరస్తాలో నిర్మించ తలపెట్టే అండర్‌పాస్ నిర్మాణం కాకుండా పిల్లర్లతో కూడిన ఫ్లై ఓవర్ పనులు చేపట్టాలన్నారు. పనామా చౌరస్తాలో అండర్‌పాస్ నిర్మాణంతో వనస్థలిపురం పరిసర ప్రాంతాల ప్రాముఖ్యత దెబ్బతినే అవకాశం ఉందన్నారు. దిప్పిబొమ్మలాగ మట్టితో నిర్మించే అండర్‌పాస్ పనులు చేపట్టకుండా భవిష్యత్ తరాలకు ఉపయోగపడేవిధంగా శాస్త్రీయ బద్ధంగా ఫ్లైఓవర్ పనులు చేపట్టాలని సూచించారు. విస్తరణ పనులు చేపడుతున్న సంబంధిత అధికారులు మూస పద్ధతిన కాకుండా భవిష్యత్ తరాలకు ఉపయోగపడే విధంగా ఫ్లైఓవర్ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ కార్పొరేటర్లు

మన్ కీ బాత్‌ను వీక్షించిన నాయకులు, కార్యకర్తలు

చంపాపేట, జూన్ 30(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని శ్రీరమణకాలనీలోని పోలింగ్ బూత్‌లోని 401లో ఆదివారం రంగారెడ్డి జిల్లా బీజేపీ అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై మన్ కీ బాత్‌ను వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం మన్ కీ బాత్ కార్యక్రమంతో దేశం నలుమూలలోని ఆదివాసులు ఏ విధంగా వృత్తులు చేపడుతున్నారో వాటికి ఉన్న ప్రాముఖ్యత అపారమైన కీర్తిని దేశానికి తెస్తున్నట్లు పేర్కొన్నారు. సామ రంగారెడ్డి మాట్లాడుతూ ప్రకృతి విలయ తాండవం చేస్తున్న ఈ తరుణంలో పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ (ఏక్ పేడ్ మాకే నామ్ పే)ఒక మొక్కను అమ్మ పేరుతో నాటాలని ప్రధాని మన్ కీ బాత్ ద్వారా పిలుపు ఇచ్చినట్లు అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎరుకల మల్లేష్‌గౌడ్, రాజేంద్రప్రసాద్, రాజుగౌడ్, వెంకటేశ్ గౌడ్, ప్రకాష్‌గౌడ్, బాలాజీ, సంతోష్ దాస్, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజశేఖర్, సందీప్, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



కేంద్రమంత్రి పియూష్ గోయల్‌తో కార్పొరేటర్ అరుణ, జిల్లా అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, సుభాష్‌చందర్జీ

చాదర్‌ఘాట్: వరుసగా మూడో సారి ప్రధానమంత్రిగా పదవి బాధ్యతలు స్వీకరించిన తర్వాత మోదీ నిర్వహించిన మొదటిసారి మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం మూసారాంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి తన నివాసంలో బూత్ స్థాయి కార్యకర్తలతో కలిసి వీక్షించారు. ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపు మేరకు అమ్మ పేరిట ఒక మొక్కను ప్రతి ఒక్కరూ నాటే కార్యక్రమాన్ని తప్పకుండా చేపట్టాలని కార్పొరేటర్ బూత్ స్థాయి కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు గౌర దేవేందర్, కార్యవర్గసభ్యులు యాదగిరి, సురేందర్, నాయకులు సంతోష్, పరశురాం, సందీప్ పాల్గొన్నారు.



మన్ కీ బాత్‌ను వీక్షిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మీరెడ్డి

కేంద్రమంత్రిని కలిసిన నేతలు

సైదాబాద్: మన్ కీ బాత్ కార్యక్రమానికి విచ్చేసిన కేంద్రమంత్రి పియూష్ గోయల్‌ను సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డి, భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సురేందర్ రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీలు కలిసి సత్కరించారు. ఏపీఏయూ కాలనీలో బీజేపీ రాష్ట్ర ఓబీసీ అధికార ప్రతినిధి లింగాల హరిగౌడ్ కార్యకర్తలతో కలిసి వీక్షించారు.

కొత్తపేట పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం

కొత్తపేట, జూన్ 30(ఆంధ్రజ్యోతి): కొత్తపేట నాగేశ్వర్‌రావుకాలనీ, ఎస్ఆర్ఎల్ కాలనీల సమీపంలో గల పార్కు అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ పవన్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఉదయం కొత్తపేట పార్కులో ఆయన వాకర్స్‌ను కలిసి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం రాజీవ్‌గాంధీనగర్ - 2లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్కులో అభివృద్ధి పనులు వేగవంతం చేసేలా సంబంధిత అధికారులను సంప్రదిస్తామన్నారు. పార్కులోపల, పరిసరాల్లోనూ పారిశుధ్య పనులు చేపట్టాలని జీహెచ్ఎంసీ పారిశుధ్య విభాగం సిబ్బందిని ఆదేశించారు. పార్కులో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయిస్తామన్నారు. పార్కులో ఆగ్నేయం వైపు ప్రహరీ నిర్మించకపోవడంతో రాత్రివేళ కొందరు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని కాలనీల ప్రతినిధులు విజయభాస్కర్, లక్ష్మిరాజం, ప్రభాకర్, మధుసూదన్‌రావు, జగన్‌రెడ్డి ఆయన దృష్టికి తెచ్చారు. అదే విధంగా పార్కు పక్కనే గల 150 చదరపు గజాల ప్రభుత్వ స్థలాన్ని కాపాడేందుకు గట్టి చర్యలు తీసుకోవాలని వారు కోరారు. సదరు స్థలం సమస్య కోర్టు పరిధిలో ఉన్నందున ఎలాంటి చర్యలు తీసుకోలేకపోతున్నామని కార్పొరేటర్ అన్నారు. తర్వాత ప్రజలు కోరిన వెంటనే ఆయన రాజీవ్‌గాంధీనగర్ - 2 కమ్యూనిటీ హాల్‌కు తాగునీటి కనెక్షన్ ఇప్పించారు. రహదారుల సమస్యలనూ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కాలనీ అధ్యక్షుడు స్వామి, దుర్గేష్, కిషన్, రాజు, నాగరాజు, మారమ్మ, లక్ష్మి పత్మ పాల్గొన్నారు.



వాకర్స్‌తో మాట్లాడుతున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

వనస్థలిపురం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): హరిహరపురం కాలనీ కమ్యూనిటీ హాల్లో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి మాట్లాడుతూ కాలనీవాసుల ఆరోగ్య పరిరక్షణకు కాలనీల్లో ఏర్పాటు చేసే ఉచిత వైద్య శిబిరాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాలనీవాసులు డి.విజయ్‌భాస్కర్, నారాయణరెడ్డి, శంకర్‌గౌడ్, హన్మంతరెడ్డి, స్వతంత్రరెడ్డి, రాములు పాల్గొన్నారు.

కాలనీల్లో పరిశుభ్రతను పాటించాలి

వనస్థలిపురం: కాలనీల్లో పరిశుభ్రతను పాటించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మసీదు గల్లీలో శానిటేషన్ సిబ్బందితో కలిసి పారిశుధ్యంపై కార్పొరేటర్ ఆదివారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీవాసులు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయవద్దని, చెత్తను చెత్త రిక్షాలోనే వేయాలన్నారు. చెత్తను రోడ్లపై వేయడం వల్ల అంటువ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ చెత్తను చెత్త రిక్షాలోనే వేయాలని సూచించారు. కార్యక్రమంలో శానిటేషన్ డీఈ వెంకటేషం, సూపర్‌వైజర్లు సంజీవ, యాదగిరి, సత్యనారాయణ, రాజు, ఉపేందర్, శ్రీధర్ గౌడ్ పాల్గొన్నారు.

కారులో సీఎన్జీ సిలిండర్ మాటున..

గంజాయి రవాణా

● పాత నేరస్థుడి అరెస్ట్
● 31.2 కేజీల గంజాయి, కారు, సెల్ ఫోన్ స్వాధీనం



సీఎన్జీ సిలిండర్‌ను గంజాయి రవాణాకు అనుకూలంగా మార్చిన నిందితులు

కొత్తపేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కారులో సీఎన్జీ గ్యాస్ సిలిండర్ కింద ఉంచి గుట్టుగా గంజాయి రవాణా చేస్తున్న పాత నేరస్థుడిని నగర శివారు తట్టిఅన్నారం వద్ద నాగోల్ పోలీసులు అరెస్ట్ చేశారు. 31.2 కేజీల గంజాయి పాకెట్లు, కారు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌హెచ్‌ఓ సుధీర్ కృష్ణ కథనం ప్రకారం.. విజయవాడకు చెందిన బోయినపల్లి సురేష్(35) కారు డ్రైవర్. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయి అక్రమ రవాణా చేస్తున్నాడు. గతంలో 2022లో గంజాయి సరఫరా చేస్తుండగా.. భద్రాచలం పోలీసులకు చిక్కి జైలుకెళ్లాడు. ఇటీవల ఖమ్మంలో అతడికి పాత పరిచయస్తుడు తారసపడ్డాడు. గంజాయి రవాణా చేసి అందిస్తే డబ్బులు ఇస్తామని చెప్పడంతో అందుకు సురేష్ అంగీకరించాడు. సురేష్‌కు సీఎన్జీ సిలిండర్ ఉన్న మారుతీ కారు ఇచ్చాడు. ఆ గ్యాస్ సిలిండర్‌ను గంజాయి భద్రపరిచేందుకు వీలుగా తయారు చేశారు. సురేష్ గంజాయి తరలిస్తున్న విశ్వసనీయ సమాచారం అందడంతో ఆదివారం ఉదయం ఎస్ఓటీ పోలీసులు, నాగోల్ పోలీసులు తట్టిఅన్నారం వద్ద వాహనాల తనిఖీల్లో భాగంగా కారును పట్టుకున్నారు. డ్రైవర్ సురేష్‌ను అదుపులోకి తీసుకుని, సీఎన్జీ సిలిండర్‌లో తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారు. ఈ గంజాయిని నిజామాబాద్ నుండి హైదరాబాద్‌కి తరలిస్తున్నట్లు విచారణలో తేలింది.



స్వాధీనం చేసుకున్న గంజాయి మూటలు

అంతర్జాతీయ మేయర్ల సదస్సుకు పారిజాతారెడ్డి

● జూలై 2 నుంచి 4వ తేదీ వరకు జకార్తాలో



సరూర్‌నగర్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఇండోనేషియాలోని జకార్తాలో జూలై 2,3,4 తేదీల్లో మూడు రోజుల పాటు యునైటెడ్ నేషన్స్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్ అండ్ సోషల్ అఫైర్స్ ఆధ్వర్యంలో సస్టెయినబుల్ డెవలప్‌మెంట్(సుస్థిర అభివృద్ధి) అనే అంశంపై నిర్వహించనున్న అంతర్జాతీయ మేయర్ల సదస్సుకు బడంగ్‌పేట్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాతా నర్సింహారెడ్డికి ఆహ్వానం అందింది. ఈ క్రమంలో ఆదివారం ఆమె జకార్తాకు బయలుదేరి వెళ్లారు. ఈ సదస్సులో సుస్థిర అభివృద్ధి సాధనకు అవసరమైన ఆరు(ఫుడ్ సిస్టమ్, ఎనర్జీ ఆక్సెస్ అండ్ అఫర్డబిలిటీ, డిజిటల్ కనెక్టివిటీ, ఎడ్యుకేషన్, జాబ్స్ అండ్ సోషల్ ప్రొటెక్షన్, క్లైమేట్ చేంజ్ అండ్ పొల్యూషన్) అంశాలపై చర్చ ఉంటుందని నిర్వాహకులు తమ ఆహ్వాన పత్రంలో పేర్కొన్నారు. కాగా మేయర్స్ ఫోరమ్ సదస్సులో తెలుసుకోబోయే అంశాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, బడంగ్‌పేట్‌లో వాటి అమలుకు గల సాధ్యాసాధ్యాలపై పరిశీలన జరుపుతామని ఆదివారం జకార్తాకు బయలుదేరిన మేయర్ పారిజాతారెడ్డి పేర్కొన్నారు.

కాప్రా చెరువును శుభ్రం చేసిన ఆర్‌కెఎస్‌సీ వలంటీర్లు



కాప్రా చెరువును శుభ్రం చేస్తున్న వలంటీర్లు

హైదరాబాద్ సిటీ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గ్రీనర్ టుమారో (రేపటి పచ్చదనం) అనే నినాదంతో రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ వలంటీర్లు కాప్రా చెరువును శుభ్రం చేశారు. ఆర్‌కేఎస్‌సీ(రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్) వలంటీర్లు, కాప్రా లేక్ రెవివల్ గ్రూప్, ఫేకోమత్ సంస్థ ప్రతినిధులతో కలిసి సంయుక్తంగా ఆదివారం ఉదయం ఏకమయ్యారు. మొత్తం 60మంది కలిసి కాప్రా చెరువును పూర్తిగా శుభ్రం చేశారు. వచ్చే తరాలకు చెరువులు, పచ్చదనాన్ని అందించాలంటే ఇప్పటి నుంచే చర్యలు అవసరమనే ఆవశ్యకతను గుర్తించిన ఆయా సంస్థలు, ఆర్‌కెఎస్‌సీ వలంటీర్లు కార్యాచరణకు పూనుకున్నారు. ఇలాంటి సేవలు కొనసాగుతాయని వారు వెల్లడించారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పెంచాలి

వనస్థలిపురం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మొక్కలకు నీరు పోసి..మన కన్నీరును దూరం చేసుకుందామని జాగృతి అభ్యుదయ సంఘం చైర్మన్ భావన శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న వనజాతర కార్యక్రమంలో భాగంగా జాగృతి అభ్యుదయ సంఘం చైర్మన్ భావన శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీలక్ష్మీనగర్‌కాలనీలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం కన్నీరు కార్చకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పెంచాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టబోయే వనజాతర కార్యక్రమంలో ప్రజలందరు భాగస్వాములై మొక్కలు నాటి పెంచాలని సూచించారు. కార్యక్రమంలో కాలనీవాసులు నాగయ్య, కర్నాకర్, జైపాల్, సందీప్‌రెడ్డి, రంగయ్య, స్వప్న, ఆంజనేయులు, కవిత, రఘునాథ్, గోపాల్‌దాస్, రాము పాల్గొన్నారు.



పదవీ విరమణ చేసిన ఉద్యోగులను సన్మానిస్తున్న డిపో మేనేజర్ హరి

పదవీ విరమణ చేసిన ఆర్టీసీ ఉద్యోగులు

చాదర్‌ఘాట్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో 30ఏళ్లకు పైగా విధులను నిర్వర్తించి దిల్‌సుఖ్‌నగర్ డిపోలో పదవీ విరమణ చేసిన నలుగురు ఉద్యోగులను డిపో మేనేజర్ హరి ఘనంగా సన్మానించారు. కండక్టర్ బీ.యాదయ్య, కంట్రోలర్ ఎంబీ నారాయణ, డ్రైవర్లు కె.భిక్షమయ్య, డీ.పెద్దులు శనివారం పదవీ విరమణ చేసిన వారిలో ఉన్నారు. వీరికి డిపో మేనేజర్ జ్ఞాపికలను అందజేశారు. డిపో సీఐ వెంకన్న, ఎంఎఫ్ వెంకటేశ్, ఏడీసీ బుచ్చిరెడ్డి, వెల్ఫేర్ బోర్డు సభ్యులు ఎంవీఎన్ రావు, ఏఎస్‌రెడ్డి, గౌరెల్లి కృష్ణ, మోహన్, జీఎస్ ఆర్, ఆనంద్ పాల్గొన్నారు.


కొత్తరకం హాషిష్ డ్రగ్

● ఉత్తరాఖండ్ నుంచి నగరానికి
● ఒకరి అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితుడు రిత్విక్

హైదరాబాద్ సిటీ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల రహిత నగరంగా మార్చాలని పోలీస్ శాఖ ప్రయత్నిస్తోంది. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తుపదార్థాలను సరఫరా చేస్తున్న స్మగ్లర్స్‌పై ఉక్కుపాదం మోపుతున్నారు. దొరికిన ముఠాను దొరికినట్టే కటకటాల్లోకి నెడుతున్నారు. అయినా, కొత్త, కొత్త స్మగ్లర్స్ పుట్టుకొస్తున్నారు. తాజాగా ఉత్తరాఖండ్ నుంచి హాషిష్ అనే కొత్తరకం డ్రగ్‌ను గుట్టుగా నగరానికి తెచ్చిన స్మగర్‌ను ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌టీఎఫ్(స్పెషల్ టాస్క్‌ఫోర్స్) పోలీసులు పట్టుకున్నారు. అతడి నుంచి 80 గ్రాముల హాషిష్ అనే కొత్తరకం డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. దాని విలువ రూ. 1.50లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. కీసర మండలం రాంపల్లి గ్రామానికి చెందిన రిత్విక్ కొంతకాలం క్రితం ఉత్తరాఖండ్‌కు వెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో అక్కడ మనుగడలో ఉన్న హాషిష్ అనే మత్తు పదార్థాన్ని వెంట తీసుకొస్తున్నాడు. ఆదివారం రైల్లో హాషిష్ డ్రగ్‌తో వస్తున్నట్లు ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఎఫ్‌టీ పోలీసులకు సమాచారం అందింది. దాంతో ఇన్‌స్పెక్టర్ ప్రదీప్‌రావు తన టీమ్‌తోపాటు సికింద్రాబాద్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్ బృందంతో కలిసి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో మాటువేశారు. ఉత్తరఖండ్ నుంచి వయా ఢిల్లీ ద్వారా రైల్లో సికింద్రాబాద్‌కు చేరుకున్న రిత్విక్‌ను అక్కడే మాటువేసిన పోలీసులు పట్టుకున్నారు. అతడి వద్ద ఉన్న హాషిష్ డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. చాకచక్యంగా స్మగ్లర్‌ను పట్టుకున్న ఎస్‌టీఎఫ్ టీమ్‌ను ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి అభినందించారు.



ఎస్‌టీఎఫ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న కొత్తరకం హాషిష్ డ్రగ్